క్లుప్తంగా

జోనల్ స్థాయి ఖోఖోలో ప్రతిభ

- రెండో స్థానంలో నిలిచిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు
- అభినందించిన ఉపాధ్యాయులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దుద్యాల్: జోనల్ స్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండో స్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచారు. గురువారం విద్యార్థులను ఉపాధ్యాయులు మెడల్స్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అండర్–14లో రాణించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్ గౌడ్, అభయ్‌కుమార్, సుధాకర్ రావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆసర’ పెంచే వరకు పోరాటం

ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ రవికుమార్



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పరిగి: ఆసర పెన్షన్ పెంచేంత వరకు పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ రవికుమార్ పేర్కొన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో పెన్షన్ దారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లాజరీస్, సురేశ్, ప్రేమ్, రాజ్‌కుమార్, రత్నం, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు, యువకులు

కుల్కచర్ల: విద్యార్థుల ఉన్నతికి కృషిచేసే ఉపాధ్యాయులను ఎప్పటికీ గుర్తించుకుంటారని పీరంపల్లి అమ్మఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ శ్రీలత అన్నారు. గురువారం బోట్యానాయక్ తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సుధీర్, విష్ణువర్ధన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించబడడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జంగయ్య, సంతోష్, ప్రవీణ్, శశికుమార్, సుమతి, మల్లేశ్, రహీం, సోనాలి, రాములమ్మ, రమేశ్, అనిల్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ అంత్యక్రియల్లో ఆనంద్




పాడె మోస్తున్న వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

మర్పల్లి: మల్లికార్జునగిరి మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు లక్ష్మయ్య బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అంత్యక్రియల్లో పాల్గొని పాడెమోశారు. ఆయన వెంట పార్టీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, మధుకర్, మోహన్‌రెడ్డి, రాచయ్య, అశోక్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

కద్లాల్: ఊరు నిండా కన్నే.. ఊరంతా సీసీ కెమెరాలే కార్యక్రమంలో భాగంగా.. చరికొండలో కెమెరాల ఏర్పాటుకు అదే గ్రామానికి చెందిన మహేందర్‌గౌడ్ రూ.21 వేల విరాళం చెక్కును గురువారం సీఐ గంగాధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాతను సీఐ, ఎస్‌ఐ, సిబ్బంది సన్మానించారు. నేర నియంత్రణకు దోహదపడే సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎస్‌ఐ వరప్రసాద్, చంద్రశేఖర్, ఏఎస్‌ఐ బాల్‌రెడ్డి ఉన్నారు.

రాజీయే రాజమార్గం



దోమ: కోర్టు పరిధిలోని చిన్న, చిన్న తగాదాలు, ఆర్థిక లావాదేవీలు, బీమా తదితర కేసులను సత్వరమే పరిష్కరించుకోవటానికి లోక్ అదాలత్ ఉత్తమం. ఇక్కడ కక్షిదారుల ఆమోదంతో రాజీకుదుర్చుకోవచ్చు. ఇరువర్గాలకు న్యాయం జరిగేలా న్యాయస్థానాలు పరిష్కార మార్గాలు చూపుతాయి. ఈ విషయంలో పై కోర్టుల్లో అప్పీలు చేసుకోవడానికి వీలులేకుండా సమస్యను పరిష్కరిస్తాయి. వివిధ కేసుల్లో బాధితులు, కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి విలువైన సమయం, ఆర్థికంగా నష్టపోకుండా తక్షణ న్యాయం ఇక్కడ లభిస్తుంది. మోటార్ వెహికల్ యాక్టు, అబ్కారీ, రుణాలు, కుటుంబ తగదాలు, చీటింగ్, యాక్సిడెంట్లతో పాటు తదితర కేసులు పరిష్కరిస్తారు. ఈ నెల 13న పరిగి పట్టణంలోని కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు డీఎస్పీ శ్రీనివాస్ పేర్కొన్నారు.

- ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్
- సత్వర న్యాయానికి వీలు
- పై కోర్టుల్లో అప్పీలు లేకుండానే కేసుల పరిష్కారం

అవగాహన లేని విషయాలపై..

చట్టంలో అవగాహన లేని విషయాలు ఎన్నో ఉంటాయి. అందులో ఒకటి లోక్ అదాలత్. కేసుల సంఖ్య పెరిగిపోతుండడంతో దీన్ని తీసుకొచ్చారు. దీంతో ఈ చట్టం ద్వారా ఇరువర్గాలకు తక్షణ న్యాయం కలుగుతుంది. దీనిని లీగల్ సర్వీసెస్ అథారిటీస్ యాక్ట్, 1987 ప్రకారం నిర్వహిస్తున్నారు. ఇది చట్టబద్ధమైన సంస్థ. ఇది దేశంలో ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానంగా రూపొందించబడింది.

ఎలాంటి ఫీజు లేదు..

పెండింగ్, న్యాయ స్థానంలో ప్రీ–లిటిగేషన్ దశలోని కేసులను పరిష్కరించే వేదిక ఇది. ఈ చట్టం ప్రకారం లోక్ అదాలత్‌లు ఇచ్చే అవార్డు సివిల్ కోర్టు కేసుగా పరిగణించబడుతుంది. రాజీకి అవకాశం ఉన్న వాటిని మాత్రమే త్వరగా పరిష్కరించుకోవచ్చు. ఆ సంస్థ ఇచ్చే తీర్పు అంతిమం. కేసులు పరిష్కారమైనప్పుడు అవార్డుకు వ్యతిరేఖంగా ఏ న్యాయ స్థానం ముందు అప్పీలు చేయడానికి అవకాశం ఉండదు. వాటి తీర్పులతో ఇరుపక్షాల మధ్య మంచి సంబంధాలు ఏర్పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా లోక్ అదాలత్‌కు వచ్చే వారికి ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం ఉండదు.

కక్షిదారుల ఆమోదం



లోక్ అదాలత్‌లో రాజీ పడేందుకు ఎలాంటి ఫీజులు చెల్లించాల్సి అవసరం లేదు. కక్షిదారుల ఆమోదం తప్పనిసరిగా ఉండాలి. దీంతో ఇరువురి మధ్య రాజీ కుదురుతుంది. మండలంలో ఏళ్ల తరబడి పెండింగ్ కేసులను రాజీ చేసుకోవాలని ఇప్పటికే సూచించాం. కేసులపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నాం. ఏదైనా సందేహాలుంటే 8712670043ని సంప్రదించాలి.

– వద్య వసంత్‌జాదవ్, ఎస్‌ఐ, దోమ

అవగాహన కల్పిస్తున్నాం



ఈ నెల 13న పరిగి కోర్టులో నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులు రాజీ చేసుకోవాలి. చాలా మంది మోటార్ వెహికల్ యాక్టు, అబ్కారీ, బ్యాంకు రుణాలు, కుటుంబ తగదాలు, భూ తగాదాలు, చీటింగ్, యాక్సిడెంట్ తదితర కేసుల్లో నిందితులుగా ఉన్నారు. వారందరూ రాజీ చేసుకోవడానికి ముందుకు రావాలి. ఈ విషయంలో గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పూర్తి వివరాలకు 8712670016 నంబర్‌పై సంప్రదించొచ్చు.

– శ్రీనివాస్, డీఎస్పీ, పరిగి

ఆ వ్యాఖ్యలు సరికావు

బీఆర్‌ఎస్ శ్రేణులు క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న సురేశ్ తదితరులు

మర్పల్లి: స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికావని, బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్, పార్టీ శ్రేణులు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మల సురేశ్, జిల్లా కార్యదర్శి రవిందర్, మాజీ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామేశ్వర్‌లు తీవ్రంగా ఖండించారు. గురువారం వారు మండల కేంద్రంలోని మార్కెట్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ విషయంలో కాంగ్రెస్ కార్యకర్తలు అండగా ఉండాలన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్నారని, నియోజక వర్గ ప్రజల కష్ట సుఖాలను తెలుసుకోవడంలో తప్పు లేదన్నారు. ఇకనుంచైనా మాజీ ఎమ్మెల్యే ఆనంద్ సక్రమంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగేష్, గణేష్ సంజీవరెడ్డి, రఫి, రమేశ్, సురేశ్, సర్వేశ్, పషి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా చేయాలి

మండల బీఆర్‌ఎస్ నాయకుడు సురేశ్



మాట్లాడుతున్న సురేశ్ తదితరులు

మోమిన్‌పేట: రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 పరీక్ష నిర్వహణలో విఫలమైనందునా చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలని మండల బీఆర్‌ఎస్ యువ నాయకుడు సురేశ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్–1పరీక్షలో అవకతవకలు జరిగాయని హైకోర్టు ఇచ్చిన తీర్పుతో తేటతెల్లమైందన్నారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే పదవినుంచి వైదొలగాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యార్థి విభాగం నాయకుడు జుబేర్, వరుణ్, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: గ్రూప్ –1 పరీక్ష నిర్వహణలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ విఫలమైనందున నైతిక బాధ్యత వహిస్తూ చైర్మన్ రాజీనామా చేయాలని బీఆర్‌ఎస్ యువ నాయకులు మంచన్ పల్లి సురేశ్ డిమాండ్ చేశారు. గురువారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రూప్ 1 పరీక్షల్లో అవకతవకలు జరిగాయని కోర్టు తీర్పును గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టింపులకు పోకుండా అభ్యర్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం యువజన విభాగం నాయకులు జుబేర్, వరుణ్, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని మార్చాలి

కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ బాబాఖాన్

ధారూరు: పోలింగ్ స్టేషన్‌ను మార్చాలని కోరుతూ అభ్యంతరం వ్యక్తం చేస్తే అధికారులు పట్టించుకోలేదని కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ బాబాఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఈ విషయం గురించి రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పోలింగ్ స్టేషన్లు, ఓటరు జాబితాలో అభ్యంతరాలను తెలియజేసేందుకు ఈ నెల 8న మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధారూరు పోలింగ్ కేంద్రాన్ని బాలికల ఉన్నత పాఠశాలకు మార్చాలని మహ్మద్ బాబాఖాన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలోని పోలింగ్ స్టేషన్ గ్రామానికి దూరంగా ఉందని, ఓటు వేయడానికి ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం గురించి వ్రాతపూర్వకంగా అధికారులను కోరినప్పటికీ పోలింగ్ కేంద్రాన్ని మార్చకపోవడం బాధాకరమన్నారు.

పరామర్శ

కుల్కచర్ల: అనారోగ్య సమస్యతో వికారాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కనకం మొగులయ్యను మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పరామర్శించారు. గురువారం ఆస్పత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదల కోసం పనిచేసేవారికి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి వైద్య సిబ్బందితో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యే కాలె యాదయ్య



పామెనలో లింక్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

చేవెళ్ల: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం ఎమ్మెల్యే కాలె యాదయ్య స్థానిక నాయులతో కలిసి మండలంలోని సింగప్పగూడలో రూ.30 లక్షలతో సీసీరోడ్డు, రూ.5 లక్షల నిధులతో వీధిలైట్లు, ఎనికేపల్లిలో రూ.20 లక్షలతో సీసీరోడ్డు, రూ.10 లక్షలతో వీధిలైట్లు, ఈర్లపల్లిలో రూ.40 లక్షలతో సీసీరోడ్డు, రూ.5 లక్షలతో వీధిలైట్లు, మున్సిపల్ పరిధిలోని మల్కాపూర్‌లో రూ.30 లక్షలతో సీసీరోడ్డు, పామెన వార్డులో రూ.30 లక్షలతో సీసీరోడ్డు, రూ.30 లక్షలతో పార్కింగ్ రోడ్డు, చేవెళ్లలోని పలు వార్డుల్లో కోటి రూపాయలతో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించటంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నారన్నారు. మండలం, మున్సిపాలిటీకి సంబంధించి మొత్తం 118 అభివృద్ధి పనులకు గాను రూ.9 కోట్ల 90 లక్షల హెచ్‌ఎండీఏ నిధులు విడుదలైనట్లు వెల్లడించారు. త్వరలో మరిన్ని నిధులు మంజూరు చేయించి అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు పాటుపడుతానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు డీవీఆర్, గోనే ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మార్కెట్ చైర్మన్ పెంటయ్యగౌడ్, సీనియర్ జిల్లా, నియోజకవర్గ నాయకులు జనార్ధన్‌రెడ్డి, వసంతం, ఆగిరెడ్డి, ఎంకేఆర్, శైలజ, సమత, గోపాల్‌రెడ్డి, ఎండీ అలీ, రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మధుసూదన్‌గుప్తా, మున్సిపల్ కమిషనర్ వెంకటేశం, పీఆర్‌డీఈ గణేశ్, ఏఈ ప్రభాకర్, మండల నాయకులు తదితరులు ఉన్నారు.

చదువుతోనే భవిష్యత్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ దేవకీదేవి

చేవెళ్ల: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్ పొందాలని వికారాబాద్ ఎస్‌ఏపీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవకీదేవి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను నిర్ధారించుకొని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. పట్టుదలతో శ్రమిస్తే విజయం ధరిచేరుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనపాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరిచయాలు చేసుకుంటూ వారి అనుభవాలను కొత్త విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రమేశ్‌బాబు, డాక్టర్ మాలిక్, ఎ.కవిత, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాకేంద్రాలను వినియోగించుకోవాలి



పరిగి: బుక్‌కీపర్లకు అవగాహన కల్పిస్తున్న అనురాధ



తాండూరు రూరల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ రతన్‌సింగ్



బొంరాస్‌పేట: గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు గోపాల్

బొంరాస్‌పేట: అర్ధంతరంగా చదువు మానేసిన, వయోజనులకోసం ఏర్పాటు చేసిన ‘ఉల్లాస్’ విద్యా కేంద్రాలను వినియోగించుకోవాలని ఉపాధ్యాయుడు గోపాల్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని టేకులగడ్డతండాలో యోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నవభారత్ సాక్షరతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దీని గురించి గ్రామసంఘాల వీఓఏలు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో స్వచ్ఛందంగా ముందుకురావాలని ఆయన కోరారు. ప్రతీ గ్రామంలో నిరక్షరాస్యులైన 15 నుంచి 50సంవత్సరాల వారికి చదువు చెప్పాలన్నారు. గ్రామ పంచాయతీల్లో మహిళా సంఘాల బుక్‌కీపర్లు, ప్రతీరోజు సాయంత్రం చదువు నేర్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. సీఆర్‌పీలు సోమ్లా, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అక్షరాస్యులుగా మారడమే లక్ష్యం

పరిగి: నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యమని స్టేట్ కోఆర్డినేటర్ అనురాధ పేర్కొన్నారు. మండలంలో బుక్‌కీపర్లకు బోధన ఎలా చేయాలనే విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు విద్యావంతులుగా మారినప్పుడే సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్‌బాబు, ఆర్పీలు ఉస్మాన్ అలీ, వెంకట ప్రసాద్, సత్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

తాండూరు రూరల్: గ్రామాల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని పెద్దేముల్ ఎంపీడీఓ రతన్‌సింగ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఉల్లాస్ – నవ భారత్ సాక్షరతా కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన కార్యక్రమమే ఉల్లాస్ అని అన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, వీఓఏలు గ్రామాల్లో నిరక్షరాస్యులకు చదువు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉల్లాస్ రీసోర్స్ పర్సన్‌లు గంజి బండెప్ప, రమేశ్, ఏపీఎం శివకుమార్ పాల్గొన్నారు.



తాండూరు రూరల్: ఇళ్లమధ్య నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు



ధారూరు: రోడ్డుపై ప్రవహిస్తున్న అలుగునీటిని పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి తదితరులు

దంచికొట్టిన వాన

- ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపిలేని వర్షం
- ఇళ్లకే పరిమితమైన ప్రజలు
- రోడ్లపై ప్రవహించిన వరద, అవస్థలు పడ్డ వాహనదారులు

తాండూరు రూరల్: తాండూరు, పెద్దేముల్ మండలాల్లో గురువారం వాన దంచికొట్టింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం కురిసింది. దీంతో పాఠశాలతో పాటు వివిధ కార్యాలయాలకు వేళ్లే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి రాత్రి వరకు కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. ఎడతేరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామంలో ఇళ్లమధ్య నుంచి వర్షాపునీరు ప్రవహించింది. దీంతో గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాండూరు మండలం అంతారం, అల్లాపూర్, సిరిగిరిపేట్‌తో పాటు పెద్దేముల్ మండలం గాజీపూర్ బ్రిడ్జి వద్ద రోడ్డు బురదమయమైంది. ఇప్పటికే పెసర, మినుము పాడయ్యాయని, పత్తి కూడా తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధారూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం తెల్లవారుజామునుంచి భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు పొంగి రోడ్లపై వరద పారింది. బస్టాండ్ నీట మునిగింది. భారీ వర్షం నేపథ్యంలో వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి మండలంలోని పలు వాగులను పరిశీలించారు.

యూరియా కోసం తప్పని కష్టాలు

- భారీ వర్షంలో సైతం క్యూలో అన్నదాతలు
- సరిపడా ఇవ్వాలని నిరసనలు



తాండూరు రూరల్: పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం కార్యాలయం వద్ద బారులు

తాండూరు రూరల్: యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయక క్యూలో నిల్చున్నారు. గురువారం ఉదయం పెద్దేముల్‌లోని రైతు సేవా సహకార కేంద్రానికి యూరియా వచ్చిన విషయం తెలుసుకుని పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచే క్యూలో నిలబడ్డారు. ఒక్కసారిగా భారీ వర్షం కురిసినప్పటికి వానలోనే లైన్లో ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. వారి పర్యవేక్షణలో అధికారులు కార్యాలయంలోని 230 బస్తాలను పంపిణీ చేశారు.

కొరత లేకుండా చూడాలి

అనంతగిరి: రైతులకు యూరియా కొరత లేకుండా చూసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి సదానంద రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు శివరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి 11 సంవత్సరాలు దాటిందని, ఏ ఒక్కరోజు కూడా రైతులు ఇబ్బంది పడలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేతగాని తనం వల్ల దళారులంతా బ్లాక్ మార్కెట్‌కి తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. వెంటనే యూరియాను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో కన్వీనర్ అమరేందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి, సూర్య ప్రకాశ్ రెడ్డి, ప్రవీణ్, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి, నర్సింలు, బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మనోహర్, నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు ప్రశాంత్, గొడుగు సుధాకర్, జే.శ్రీనివాస్ రెడ్డి, చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

అవకాశవాద రాజకీయాలు వద్దు

కుల్కచర్ల: యూరియా లభ్యతపై కొంతమంది అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతున్నారని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..కేంద్రం నుంచి రావాల్సిన యూరియా ఆలస్యం కావడంతోనే ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలానికి 200టన్నులు తెప్పించేందుకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి వ్యవసాయాధికారులకు సూచించారన్నారు. బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, బీసీ సెల్ అధ్యక్షుడు మహేశ్, చౌడాపూర్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

హస్నాబాద్ రైతువేదికకు చేరుకున్న 220 బస్తాలు

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ రైతువేదికకు పీఏసీఎస్ సొసైటీ వారు 220 బస్తాలు పంపించారు. దీన్ని స్థానిక రైతు వేదికలో నిల్వ ఉంచి పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం యూరియా అవసరం ఎక్కువగా ఉందని, కావున అందరికి అందాలనే ఉద్దేశ్యంతో ఒక్కో రైతుకు ఒక్కో బస్తా మాత్రమే పంపిణీ చేయనున్నట్లు వివరించారు.